

ర్యాలీలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

అట్టహాసంగా కిరణ్ నామినేషన్

పుంగనూరు, ఏప్రిల్ 24: రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, నల్లారి ఆనంద్‌రెడ్డి, అడ్వకేట్ అమరనాథరెడ్డిలతో కలసి వెళ్లి అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కిషోర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం రాజంపేట పార్లమెంటు పరిధిలోని బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులతో కలసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఇంతియాజ్ అహ్మద్, పర్వీన్‌తాజ్, సోమల సురేశ్, పుంగనూరు, పీలేరు, కన్వీనర్లు మదన్‌మోహన్ బాబు, పుత్తూరు శ్రీకాంత్, జనసేన నాయకులు చిన్నారాయుల్ తదితరులు పాల్గొన్నారు.



రిటర్నింగ్ అధికారికి డమ్మీ నామినేషన్ పత్రం అందజేస్తున్న చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న గురజాల

ముగిసిన టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు

చిత్తూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమాలు బుధవారంతో పూర్తయ్యాయి. ఇక పోలింగ్‌కు 19 రోజులు మాత్రమే గడువు ఉంది. కీలకమైన ఈ సమయాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని గెలిచేందుకు వ్యూహాలు రచించుకుంటున్నారు. 21న చంద్రబాబు నుంచి బీఫాంలు అందుకున్న అభ్యర్థులు నామినేషన్లను అట్టహాసంగా వేశారు.కుప్పంలో చంద్రబాబు తరఫున ఆయన సతీమణి భువనేశ్వరి వేయగా, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి, పుంగనూరులో అమర్నాథ్ రెడ్డి, మురళీమోహన్, గురజాల జగన్మోహన్, థామస్,గాలి భాను, చల్లా రామచంద్రారెడ్డిలు నామినేషన్లు వేశారు. చిత్తూరు ఎంపీ స్థానానికి ఆర్భాటం లేకుండా నామినేషన్ వేసిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చివరిగా చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్మోహన్ బుధవారం వేసిన నామినేషన్‌తో టీడీపీ అభ్యర్థుల తంతు ముగిసింది.

చతికిలబడ్డ రిజిస్ట్రేషన్లు

ఐదేళ్లుగా లక్ష్యం చేరుకోని వైనం

ఆదాయం నేలచూపులు

వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలే కారణం



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24 : రాబడి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ శాఖనూ వదిలిపెట్టలేదు. ప్రతి శాఖలోనూ అందిన కాడికి పిండుకోవడానికే ప్రయత్నించింది. ఇందులో ప్రధానంగా రిజిస్ట్రేషన్ శాఖను ఎంచుకుంది. అడ్డుగోలుగా ఫీజులు పెంచేసి, ప్రజలపై భారం మోపి, ఖజానా నింపుకునే ప్రయత్నం చేసింది. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం భారీగా పడిపోయింది. ఈ క్రమంలో జిల్లా ఏ సంవత్సరం కూడా వంద శాతం లక్ష్యాన్ని చేరలేదు. 2018-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లాలో రూ.129.42 కోట్లు రిజిస్ట్రేషన్ల ఆదాయ లక్ష్యం కాగా రూ.133.24 కోట్లతో 102.95 శాతం వృద్ధి సాధించింది.

సంవత్సరం	లక్ష్యం	వసూళ్లు	శాతం	జరిగిన (రూ.కోట్లలో) రిజిస్ట్రేషన్లు
(ఉమ్మడి చిత్తూరు జిల్లా)				
2017-18	270.48	279.45	---	------
చిత్తూరు జిల్లా...				
2018-19	129.42	133.24	102.95	66,218
2019-20	84.01	64.33	76.58	42,843
2020-21	81.05	72.70	89.70	43,959
2021-22	108.49	102.89	94.84	74,692
2022-23	133.21	122.55	92.00	68,810
2023-24	181.78	92.52	50.90	86,622

● నడ్డి విరిచిన యూజర్ ఛార్జీలు

యూజర్ ఛార్జీలు పెంపుతో ఎన్కమ్బరెన్స్ సర్టిఫికెట్లు (ఈసీలు), సర్టిఫైడ్ కాపీలు పొందే రైతులు, సామాన్యులకు భారంగా మారింది. నకళ్లు, స్టాంపులు, ఈసీ, మార్కెట్ వాల్యూ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, సొసైటీ తదితర సేవలపై పది రెట్లు చార్జీలను పెంచింది. తద్వారా ఈ ఏడాది ప్రారంభంలో జిల్లా కక్షిదారులపై రూ.10 కోట్ల మేర భారం పడింది. సింగిల్ విండోల ద్వారా రుణాలు పొందే రైతుపై రూ.50 నుంచి రూ.1,500 వరకు భారం పడింది. వీలునామా, గిఫ్ట్ డీడ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో పాటు సేల్ డీడ్‌లపై కొత్తగా రూ.500 చొప్పున యూజర్ చార్జీలను ప్రవేశపెట్టారు. మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ గతంలో రూ.10 ఉండగా రూ.50కి పెంచారు. భూములకిచ్చే ఈసీ సర్టిఫికెట్ గతంలో రూ.10 ఉండగా ఇప్పుడు రూ.100 చేశారు. సర్టిఫికెట్ కాపీ యూజర్ ఛార్జి రూ.20 నుంచి రూ.100కు పెంచారు.

మితిమీరిన రాజకీయ జోక్యం

వైసీపీ పాలనలో మితిమీరిన రాజకీయ జోక్యం రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం నేలచూపులు చూడడానికి కారణమైంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా భూకబ్జాలకు పాల్పడ్డారు. దీంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి క్రయ, విక్రయదారులు వెనకడుగు వేశారు. అదే సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. ప్లాట్ల అమ్మకాలు అంతంతమాత్రమే జరిగాయి. మరో వైపు ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పీఎఫ్ డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లో వారు ఆస్తుల కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం మారితే తప్ప పరిస్థితులు మారవని రియల్టర్లు అంటున్నారు.

వైసీపీ నేతల ధనదాహమూ కారణమే..

వైసీపీ నేతల ధనదాహం కూడా రియల్ ఎస్టేట్ రంగం పతనానికి కారణమైంది. వెంచర్లు వేయాలంటే నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, చోటా మోటా నాయకుల జేబులు నింపాల్సి వస్తోంది. నాన్ లేఅవుట్ అయితే ఎకరాకు రూ.10 లక్షలు, లేఅవుట్ అయితే రూ.5 లక్షలు అదనంగా నాయకులకు చెల్లించాలి. నిర్మాణ విషయంలోనూ విడతలవారీగా రూ.లక్ష ముట్టజెప్పాల్సి వస్తోంది. ఈ కారణంగా ఐదేళ్లలో నిర్మాణాలు పూర్తిగా స్తంభించాయి. వెంచర్లు ఆగిపోయాయి.

నామినేషన్ల జోరు

పార్లమెంటుకు 08, అసెంబ్లీకి 55

మొత్తం 180కి చేరిన సంఖ్య

నామినేషన్ల స్వీకరణకు నేడు ఆఖరు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు 63 నామినేషన్లు అందాయి. చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి 8, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 55 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకు అందిన నామినేషన్ల సంఖ్య 180కి చేరింది. నామినేషన్ల స్వీకరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలతో ముగియనుంది. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బుధవారం దాఖలైన నామినేషన్ల వివరాలిలా ఉన్నాయి..

● చిత్తూరు పార్లమెంటు స్థానానికి టీడీపీ నుంచి దగ్గుమళ్ల ప్రసాదరావు, దగ్గుమళ్ల రాధేయ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్.భూలక్ష్మి, బహుజన సమాజ్ పార్టీ టి.విజయ్ కుమార్, విడుదలై చిరుతైగల్ కట్చి యూ.గణపతి, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కె.మునికృష్ణ, ఎన్.జయకర్, ఎస్.రవి నామినేషన్లు వేశారు.

● పుంగనూరు అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ జి.మురళీమోహన్, జి.నందకుమార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఐ.నాగేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ వి.సురేష్ ఒక్కొక్క నామినేషన్లు దాఖలు చేశారు. సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా షేక్ అన్వర్ బాషా రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గడ్డం రామయ్య, బిల్ల గోపాల్ నామినేషన్ వేశారు.

● నగరి నియోజకవర్గానికి వైసీపీ నుంచి ఆర్కే. రోజా, ఆర్కే. సెల్వమణి, బహుజన సమాజ్ పార్టీ వై.నాగూర్, కాంగ్రెస్ ప్రభాకర్ రెడ్డి, పి.రాకేష్ రెడ్డి, జై భారత్ నేషనల్ పార్టీ జి.షిర్డీ సాయిరామ్, నీతి నిజాయితీ పార్టీ ఎ.చిట్టిబాబు, జాతీయ జనసేన పార్టీ ఎ.భానుప్రకాష్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పి.డి.నారాయణస్వామి మొదలి నామినేషన్లు వేశారు.

● గంగాధరనెల్లూరుకు టీడీపీ నుంచి వడియంగాడు నీది రెండు సెట్లు, పచ్చికాపొలం రవికుమార్, వడియంగాడు మునస్వామి థామస్, బహుజన సమాజ్ పార్టీ పి.భాస్కర్, కాంగ్రెస్ బి.ఎస్.జయప్రకాష్, జైభారత్ నేషనల్ పార్టీ సి.శేఖర్, ఇండిపెండెంట్ అభ్యర్థులు సి.పద్మనాభం, పులివేలం మధు రెండేసి సెట్లు, కె.కరుణశ్రీ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

● చిత్తూరుకు టీడీపీ నుంచి సీజీ జగన్ మోహన్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అఖిల భారతీయ జనసంఘ్ బి.కె.రమణారెడ్డి, బహుజన సమాజ్ పార్టీ బి.లోకనాథం, ఎ.కుమార్, సమాజ్‌వాది పార్టీ వి.సరిత, కాంగ్రెస్ జి.టికారాం, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కె.ప్రభాకర్ రెడ్డి, పి.ముద్దుకృష్ణ, కవి మోహన్ విజయ్‌కుమార్, వి.తేజేష్ నామినేషన్లు వేశారు.

● పూతలపట్టుకు బహుజన సమాజ్ పార్టీ నుంచి కాణిపాకం నాగేశ్వర, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఆర్.రోజా, సి. ప్రవీణ్‌కుమార్, అఖిల భారతీయ జనసంఘ్ కట్టమంచి విశ్వనాథ సాయిమోహన్, ఆలిండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ తోటి ఎన్.ఆర్.నవీన్ నామినేషన్లు వేశారు.

● కుప్పంకు టీడీపీ నుంచి నారా చంద్రబాబు నాయుడు, వైసీపీ భరత్, విడుదలై చిరుతైగల్ కట్చి గోవిందప్ప, కాంగ్రెస్ ఎ.గోవిందరాజులు, ఇండిపెండెంట్లుగా వి.పార్థసారథి రెడ్డి, సురేంద్ర కుమార్, జి.తిమ్మరాయప్ప నామినేషన్లు వేశారు.

● పలమనేరుకు కాంగ్రెస్ బి.శివశంకర్ రెండు సెట్లు, ఎస్.ఉష ఒక సెట్ నామినేషన్ వేశారు.

వైసీపీ ర్యాలీలో మద్యం ఏరులు

● నామినేషన్ వేసిన వైసీపీ అభ్యర్థి భరత్



కుప్పం, ఏప్రిల్ 24 : వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా కుప్పంలో బుధవారం జరిగిన ర్యాలీలో మద్యం ఏరులై పారింది. ఇతర ప్రాంతాల నుంచి జనాలను వాహనాలలో ర్యాలీకి తరలిస్తున్న దృశ్యాలు కుప్పం నలుమూలలా కనిపించాయి. భరత్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత కూడా మద్యం దుకాణాల ముందు బారులు తీరిన వైసీపీ జెండాలు కట్టిన ద్విచక్ర వాహనాల వీడియోలు వైరల్ అయ్యాయి. కొంతమంది కార్యకర్తలయితే రెండు చేతుల్లో పట్టినన్ని మద్యం బాటిళ్లు పట్టుకుని తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి. డబ్బు, మద్యం, బిరియానీ ప్యాకెట్లు ఇచ్చి, ఇతర రాష్ట్రాలకు చెందిన జనాలను ర్యాలీకి తరలించినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. ఇంత చేసినా ఈనెల చంద్రబాబు నామినేషన్ సందర్భంగా ఆయన సతీమణి భువనేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకంటే వైసీపీ ర్యాలీకి జనం చాలా తక్కువగా హాజరయ్యారని అధికార పార్టీకి చెందిన కార్యకర్తలే అంటుండడం కొసమెరుపు.



బారు వద్ద వైసీపీ జెండాలు కట్టిన ద్విచక్ర వాహనాలు - మద్యం దుకాణం సమీపంలో ఇదీ పరిస్థితి

ఏం మేలు చేశారని మళ్లీ వచ్చారు?

మంత్రి రోజాను అడ్డుకున్న ఎస్టీఆర్ పురం ఎస్టీ కాలనీవాసులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24 : మాకేం మేలు చేశారని ఓట్లడగడానికి వచ్చారంటూ మంత్రి రోజాను ఎస్టీలు నిలదీశారు. వడమాల పేట మండల పరిధిలోని ఎస్టీఆర్ పురం పంచాయతీ ఎస్టీ కాలనీవాసులు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారానికి వచ్చిన రోజాను పొలిమేరలోనే అడ్డుకున్నారు.తమ గ్రామంలో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించలేదంటూ ఫైర్ అయ్యారు.గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామని, స్మశానానికి స్థల సమస్య తీరుస్తానని గత ఎన్నికలకు ముందు రోజా కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఐదేళ్లు పూర్తయినా ఒక్క సమస్యను కూడా పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.రేపటి లోపల సమస్యను పరిష్కరిస్తానని మంత్రి రోజా నచ్చజెప్పినప్పటికీ ఎస్టీ కాలనీవాసులు విశ్వసించలేదు. ఎట్టి పరిస్థితుల్లో తమ గ్రామంలో అడుగు పెట్టకూడదని పొలిమేర వద్దే అడ్డుతగిలారు. దీంతో చేసేది లేక మంత్రి రోజా వెనుదిరిగారు.



రోజాను అడ్డుకుంటున్న వారికి నచ్చజెబుతున్న మంత్రి సెక్యూరిటీ సిబ్బంది

పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు

కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో భాగం గా అధికారులు గాని, ఏజెంట్లు గాని పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో రాజకీయ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అర్హులైన వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తామన్నారు. మే 3న పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. జిల్లా వాసులు, జిల్లాలో పనిచేసే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12ను పొంది మే 5న అందజేయాలని కోరారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తుంటే అలాంటి ఉద్యోగులు ఫారం-12డి పొంది అందజేస్తే సంబంధిత జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. ఇటీవల 6వేల కొత్త ఎపిక్ కార్డులు అందాయని, వాటిని పోస్టల్ ద్వారా ఓటర్లకు పంపిస్తామని అన్నారు. ఓటరు స్లిప్పులు మే 1 నుంచి 6వ తేదీ వరకు బీఎల్‌వోల ద్వారా ఇంటింటికీ అందిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

కుప్పం ఘటనపై డీఎస్పీ విచారణ

కలెక్టర్, ఎస్పీలకు నివేదిక

చిత్తూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్వో కార్యాలయంలోకి సోమవారం నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ అభ్యర్థి భరత్ సతీమణి వాహనం వెళ్లిన ఘటనలో ముగ్గురు పోలీసు అధికారులను బాధ్యులను చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా ఆర్వో తనకు సంబంధం లేదని తప్పుకున్నారు. డీఎస్పీ స్థాయి అధికారి విచారించి ముగ్గురు పోలీసు అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికను జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్‌తోపాటు ఎస్పీ మణికంఠకు అందినట్లు సమాచారం. ఎన్నికల సంఘానికి కలెక్టర్ మరో రిపోర్టును అందించనున్నారు. కాగా, భరత్ సతీమణి ఆర్వో కార్యాలయంలోకి 10:32 గంటలకు వెళ్లారని, నిబంధనల ప్రకారం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుండడంతో ఇందులో తప్పు లేదని అధికారులు భావిస్తున్నారు.

కుప్పం ఆర్వో కార్యాలయంపై డ్రోన్ కెమెరా

● యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు





కుప్పం ఆర్వో కార్యాలయం ఎదుట డ్రోన్ కెమెరాతో చిత్రీకరిస్తున్న యువకుడు - పోలీసుల అదుపులో యువకుడు

కుప్పం, ఏప్రిల్ 24: కుప్పం నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంపై బుధవారం డ్రోన్ కెమెరా ఎగరడం కలకలం సృష్టించింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ ఘటనకు కారకుడైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా కుప్పంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం భరత్ నామినేషన్ వేయడానికి వంద మీటర్ల దూరం నుంచి ఆర్వో కార్యాలయానికి బయలుదేరారు. ఈ దృశ్యాన్ని చిత్రీంచడానికి ఒక యువకుడు ఆర్వో కార్యాలయం ఎదుట డ్రోన్ కెమెరాను ఎగరేశాడు. పరిసరాలను చిత్రీకరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా యువకుడిని అదుపులోకి తీసుకుని, అసిస్టెంట్ ఎన్నికల అధికారి అయిన మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించామని చెప్పారు. యువకుడికి కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ కార్యకర్త కావడమే నేరమా..?

● ఇంటి నిర్మాణ పనుల అడ్డగింత

చౌడేపల్లె, ఏప్రిల్ 24: టీడీపీ కార్యకర్త కావడే నేరమైందని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం వాపోయారు. ఆయన తమ్ముడు హరి బోయకొండ క్రాస్‌లో ఇంటి నిర్మాణం చేపట్టారు. అయితే బుధవారం అనుమతులు లేవంటూ సచివాలయ సిబ్బంది వచ్చి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయకొండ క్రాస్ వద్ద తన తండ్రి వెంకటాద్రికి 3.95 సెంట్లు భూమి ఉందన్నారు. ఆభూమిలోనే తన తమ్ముడు ఇల్లు నిర్మించుకుంటూ ఉంటే కక్షపూరితంగా వైసీపీ నేతల ఒత్తిడితో అధికారులు అడ్డుకోవడం తగద న్నారు. గతంలో కోళ్ల ఫారాలు నిర్వహిస్తుంటే అప్రూవల్ లేదని కోళ్లు మేపకుండా అడ్డుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ ఇంటి నిర్మాణ పనులు అడ్డుకుని వేధిస్తున్నారని తెలియ జేశారు. సమీపంలో వైసీపీ వారు రెండతస్తుల భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోని అధికారులు తమను అడ్డుకోవడం న్యాయం కాదన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వసుంధరను వివరణ కోరగా పంచాయతీ అప్రువల్ లేని కారణంగా నిర్మాణాలు చేయవద్దని సూచించామన్నారు. అనుమతులు తీసుకుని నిర్మించుకోవచ్చని తెలియజేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం


ననియాలలో శంఖారావం గజేంద్ర తదితరులు

రామకుప్పం, ఏప్రిల్ 24: పరిపాలనాదక్షుడైన చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, 89పెద్దూరు యూనిట్ ఇన్‌చార్జీ గజేంద్ర తెలియ జేశారు. బుధవారం రాత్రి వారు గడ్డూరుయానాదికాలనీ, ననియాల గ్రామాల్లో ప్రచారం చేశారు. గ్రామస్తులకు సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంతో బాటూ, కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. మళ్లీ అభివృద్ధి చెందాలంటే బాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మునిరెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, బాబు, సతీష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసుపై విచారణ

చౌడేపల్లె, ఏప్రిల్24: మండలంలోని ఓ మానసిక వికలాంగురాలిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి సోమవారం అత్యాచారానికి యత్నించిన విషయం తెలిసిందే. దీనిపై డీఎస్పీ సుధాకర్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆయన వెంట పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావణ వాహనంపై ఊరేగిన కాశీవిశ్వేశ్వరుడు



రామకుప్పం, ఏప్రిల్ 24: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు రావణ వాహనంపై విహరించారు. ఉభయదారులు కైకాల నారాయణప్ప కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి విద్యుద్దీప, పుష్పాలంకృత రావణ వాహనంలో స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్థానిక బ్రాహ్మణ వీధిలో నిర్వహించిన దీపోత్సవం వీక్షకులను అలరించింది. ఆలయం వద్ద అయ్యప్పగానిపల్లె కళాకారుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పలమనేరులో మరో మూడు నామినేషన్లు

పలమనేరు, ఏప్రిల్24 : పలమనేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి బుధవారం మరోమూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి బి.శివశంకర్ రెండు నామినేషన్లు వేయగా ఆయన సతీమణి యస్.ఉషా ఓ సెట్ నామినేషన్ వేశారు. దీంతో బుధవారం నాటికి పలమనేరులో మొత్తం నామినేషన్ల సంఖ్య 21కి చేరింది.

పుంగనూరులో ఏడు నామినేషన్ల దాఖలు

పుంగనూరు, ఏప్రిల్24: పుంగనూరు శాసనసభకు బుధవారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. బుధవారం స్థానిక ఎన్నికల అధికారి కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున జి.మురళీమోహన్, జి.నందకుమార్, బీఎస్పీ తరపున వి.సురేశ్, పిరమిడ్ పార్టీ తరపున నాగేశ్వరరావు, ఎస్‌డీపీఐ అభ్యర్థిగా కేఎస్ అన్వర్‌బాషా, స్వతంత్ర అభ్యర్థులుగా గడ్డం రామయ్య, బి.గోపాల్ నామినేషన్ వేశారు.

వీ.కోట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సద్దాం


నియామక పత్రాన్ని అందుకుంటున్న సద్దాం

వి.కోట, ఏప్రిల్ 24: వి.కోట మండల యూత్ కాంగ్రెస్ అధ్య క్షులుగా వి.కోట ధన్నపురానికి చెందిన ఎస్.సద్దాం హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశవరాజు పలమనేరులో ప్రకటన విడుదల చేశారు. అలాగే జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా వి.కోట మండలం కృష్ణాపురానికి చెందిన షేక్ తజముల్ బాషాను నియ మించారు. తమ నియామకానికి కృషిచేసిన జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఏపీసీసీ సభ్యులు ఇనాయతుల్లాకు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలి


చెంగుబల్ల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి, డాక్టర్ సురేష్‌బాబు

శాంతిపురం, ఏప్రిల్ 24 : ఓటు అనే ఆయుధంతో వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామరెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని చెంగుబల్ల, శెట్టిబల్ల, సోగడబల్ల, కురుబూరు, వడ్డివానికొత్తూరు గ్రామాలలో యూనిట్ ఇన్‌చార్జి గోపాల్, మాజీ సర్పంచ్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మంజునాథ్ ఆధ్వ ర్యంలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు చెంగు బల్ల పంచాయతీ మాజీ సర్పంచ్ మంజునాథ్ ఆధ్వర్యంలో సోగడబల్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శంకరప్ప, రాజు, పురుషోత్తం ముబారక్, అబ్జల్, మురు గేష్, వెంకటేష్, రమేష్‌తో పాటు మరో 20 కుటుంబాలు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరాయి. మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ రెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామి, టీడీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణంరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు కిషోర్, బీజేపీ మండల కన్వీనర్ కాశీనాథ్, శ్యామల, పౌలారాణి, చంద్రకళ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన చౌకదుకాణ డీలర్ సస్పెన్షన్

కల్లూరు, ఏప్రిల్ 24: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చౌకదుకాణ డీలర్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాలు ఇచ్చారని తహశీల్దార్ వసంతలత తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు చౌక దుకాణం డీలర్ (నెంబర్ 1041031) షాహీన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని స్థానిక టీడీపీ నాయకులు ఈ నెల 17న ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. విచారణలో నిజమని తేలడంతో ఆమె డీలర్‌షిప్‌ను సస్పెన్షన్ చేశారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



వీ.కోటలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలు, బైరెడ్డిపల్లెలో ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు

వి.కోట, ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీకి కంచుకోటైన వి.కోటలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. బుధవారం మండల సరిధిలోని నెర్నపల్లె, బోడిగుట్టపల్లె, వి.కోట పంచాయతీలో ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం మండల స్థాయి పార్టీనేతలు, క్లస్టర్ ఇన్‌చార్జులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాంబాబు, సుబ్బన్న, చౌడప్ప, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జులు ధీరజ్, శబరీష్, జనార్ధన్‌రెడ్డి, రాము, గౌస్‌పీర్, విశ్వనాథ్, రామూర్తి ఆచ్చారి, హరానాథరెడ్డి, సుబ్రమణ్యం శెట్టి, సతీష్, చంగప్ప, ఉమ్మర్ షేక్ తదితరులు ఉన్నారు.

జోరుగా పార్టీలో చేరికలు

వి.కోటలో పలువురు వైసీపీని వీడి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మండల పరిధిలోని పాముగానిపల్లె, కుంబార్ల పల్లె, నెర్నపల్లె, బోడిగుట్టపల్లె పంచాయతీలో పెద్దఎత్తున టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పాముగానిపల్లె నుంచి హనుమంతరెడ్డి, ప్రకాష్, వలంటీర్ అశోక్‌కుమార్, బాబు, సోమశేఖర్, పుష్పరాజ్‌లు టీడీపీలో చేరారు.

బైరెడ్డిపల్లె: జరగనున్న ఎన్నికల్లో టీడీపీ సెక్షన్ ఇన్‌చార్జిలు కీలకపాత్ర పోషించి టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీమంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని లక్కనపల్లె, నెల్లిపట్ల గ్రామాల్లో రెండు క్లస్టర్‌లకు సంబంధించి సెక్షన్, యూనిట్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు మాజీమంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి పాల్గొన్నారు. ● బైరెడ్డిపల్లెలో టీడీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్య క్షుడు కిశోర్‌గౌడు, నాయకులు జయకుమార్, భువన చంద్రగౌడు, అరుణ్, రాజేష్, చెంగ్రాయప్ప, జనసేన నాయకుడు సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, ఏప్రిల్ 24: టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో కృషిచేయాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డిలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు ఇక్కడికి రాకముందు ఉన్న పరిస్థితులు ఆయన వచ్చాక జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని తెలియజేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్ వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో ఏడు నామినేషన్లు


చంద్రబాబు తరపున నామినేషన్ వేస్తున్న జాకీర్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 24: కుప్పం శాసనసభ నియోజకవర్గానికి బుధవారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా కృష్ణ రాఘవ జయేంద్ర భరత్, విడుదలై చిరుతైగల కచ్చి పార్టీ తరఫున గోవిందప్ప, కాంగ్రెస్ అభ్యర్థిగా ఎ.గోవిందరాజులు, స్వతంత్ర అభ్యర్థులుగా వెంకటరామిరెడ్డి పార్థసారథిరెడ్డి, సురేంద్రకుమార్, జి.తిమ్మరాయయప్ప నామినేషన్లు వేశారు. అలాగే టీడీపీ అభ్యర్థి చంద్రబాబు తరఫున ఆ పార్టీ నాయకుడు జాకీర్, న్యాయవాది అమర్ నామినేషన్ వేశారు.

టీడీపీ రాగానే మహిళలకు ఉచిత ప్రయాణం




చల్లాబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పులిచెర్ల, పుంగనూరు వైసీపీ నాయకులు ● చౌడేపల్లె మండలం గాజులవారిపల్లెలో ప్రచారం

రొంపిచెర్ల, ఏప్రిల్ 24: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మహిళాభివృద్ధి సాధ్యమని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి అన్నారు. బుధవారం ఆమె బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని ఫజులూపేట, లక్ష్మీ నగర్‌కాలనీ, వినాయక నగర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓట్లేసి తన భర్తను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, ఎంపీటీసీ సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో పులిచెర్ల మండలం బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వైసీపీ నాయకులు కరుణా కర్‌నాయుడు, ప్రభు, వెంకటముని, మహేష్, మొహన్ నాయుడు, దేవేంద్ర, కృష్ణకు చల్లాబాబు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముల్లంగి వెంకట్రమణ, ధనంజయ నాయుడు, కుమార్‌రెడ్డి, పూల రమేష్ మోహన్‌దాస్, భాస్కర పాల్గొన్నారు. ● పుంగనూరు షికారిపేటకు చెందిన వైసీపీ నాయకులు వెంకటేష్, అక్కమ్, రాణీ బాబు, చిట్టిబాబు, జయపూరి, బ్రహ్మయ్య టీడీపీ తీర్థం స్వీకరించారు. నరసింహులు, శేఖర ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. చల్లాబాబు వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సోమల: టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పీఎం.మల్లికార్జున సోమల పంచాయతీ చిన్న సోమల, ముంద్రివారిపల్లె, సోమలలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, మహేంద్రబాబు, అశోక్, కపిల సుబ్రమణ్యం, సుబ్బయ్య శెట్టి, గంగాధరం పాల్గొన్నారు.

● జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో గురికానివారిపల్లె, చిన్న ఉప్పరపల్లెల్లో ప్రచారం చేశారు.

చౌడేపల్లె: చల్లా రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సోదరి వీణారెడ్డి టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డితో ఆధ్వర్యంలో పీఎల్ కోత్తూరు, కాగతి, పెద్దూరు, గాజులవారిపల్లె, కురప్పల్లె, యల్లంపల్లె, యనమసామనపల్లె, పలగార్లపల్లె, పొన్ను పెంట తదితర గ్రామాలలో ఇంటింటా ప్రచారం చేశారు.

సదుం: సదుం మండలంలోని చెరుకువారిపల్లె, నడిగడ్డ పంచాయతీల్లో చల్లాబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత మంగళవారం గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త కృష్ణయ్యను పరామర్శించారు.


చెరుకువారిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చల్లా బాబు

కల్లూరు: పులిచెర్ల మండలంలోని పులిచెర్ల, దేవళంపేట పంచాయతీలోని వగళ్లవారిపల్లి, మిట్టమీదరాచపల్లి, చిన్న బెస్తపల్లి, ఎస్టీ కాలనీ తదితర గ్రామాల్లో చల్లా పూజారెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. తన తండ్రి చల్లా రామ చంద్రారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు.

గెర్నిపల్లెలో వైసీపీకి బిగ్‌షాక్

వైసీపీ నేత సుధాకర్‌రెడ్డితో బాటు టీడీపీలో చేరిన ముస్లింలు


పార్టీలో చేరిన సుధాకర్‌రెడ్డితో ఆనందరెడ్డి


పార్టీలో చేరిన ముస్లింలతో టీడీపీ నేతల

రామకుప్పం, ఏప్రిల్ 24: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గెర్నిపల్లెలో వైసీపీకి బిగ్‌షాక్ తగిలింది. స్థానిక వైసీపీ నేత సుధాకర్‌రెడ్డి, వార్డు మెంబరు అన్వర్‌సాబ్, కార్యకర్తలు అస్లాం, ముబారక్, అక్బర్, మహబూబ్‌సాబ్, అజ్మతుల్లా, సయ్యదుల్లా, మునాఫ్, ఇంతియాజ్, అక్రం, ఎల్.ఆరీఫ్, ఎ.ఆరీఫ్, అఫ్రిద్, మదార్, బాబు, మస్తాన్, మహబూబ్‌బాషాలు బుధవారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీ మహ్మద్‌రఫీ, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి సలాంసాబ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అక్బర్ బాషా, సీనియర్ నేత నందారెడ్డిలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే మైనారిటీలకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీతో జతకట్టడం వల్ల ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. గతంలో ఎన్డీయే బాగస్వామిగా ఉన్నప్పటికీ టీడీపీ ప్రభుత్వం రంజాన్ తోఫా, షాదీముబారక్ పథకాలు అమలు చేపిందన్నారు. అదేవిధంగా షాదీఖానాలకు మరమ్మతులు, కొత్తషాదీఖానా నిర్మాణాలు, కబరస్తాన్లకు ప్రహరీల నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఇమాం, మౌజమ్‌లకు గౌరవవేతనాలు అందించిందన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను అందజేసిందన్నారు. అవన్నీ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆపేసిందన్నారు. తిరిగి అవన్నీ అమలు కావాలంటే ముస్లింలంతా టీడీపీని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు పెరుమాళ్, నేతలు మునిరెడ్డి, రమేష్‌రెడ్డి, సతీష్, బాబు, నియాజ్, నాసిర్, సలాం, రమాకాంత్, పురుషోత్తం, హైదర్, పండుసాబ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నల్లారి నామినేషన్‌కు తరలిన నాయకులు

చౌడేపల్లె, ఏప్రిల్24: రాజంపేట ఎంపీ అభ్యర్థి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు చౌడేపల్లె బీజేపీ నాయకులు రాయచోటికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కడియాల మనోహర్, నాయకులు చిన్నికిశోర్, గందోడిప్రవీణ్, శ్రీనివాసులు, రత్నయ్య, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమల: అన్నమయ్య జిల్లా రాయచోటిలో రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి, చిత్తూరులో టీడీపీ అభ్యర్థి జగన్‌మోహన్ నామినేషన్ కార్యక్రమానికి మండల టీడీపీ, జనసేన నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

సోమల, ఏప్రిల్ 24: సోమల కోదండ రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలో పచ్చని తోరణాలు, విద్యుత్ అలంకరణల కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను సుందరంగా ముస్తాబు చేశారు. అర్చకులు రామరత్నంస్వామి వేద మంత్రాల నడుమ ఆది దంపతుల కల్యాణం కమనీయంగా జరిపించారు. ఆలయ ధర్మకర్తలు వార్తకవి కుటుంబసభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. సోమల, చెన్నయ్యగారిపల్లె, అడు సుపల్లె, రాశెట్టివారి పల్లె, తదితర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పూజలు జరిపారు.

25 లీటర్ల సారా స్వాధీనం

సోమల, ఏప్రిల్ 24: మండలంలోని పేగలవారిపల్లె సమీపంలో గుండు వంక వద్ద సారా తయారీ కేంద్రాల్లో సోమల పోలీసులు దాడులు చేసి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసు కున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 750 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగిస్తున్న వస్తువులను ధ్వంసం చేశారు.

ప్రశాంత పోలింగే లక్ష్యం



చౌడేపల్లె, ఏప్రిల్24: ప్రశాంత పోలింగే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు అబ్జర్వర్ కవిత పేర్కొన్నారు. బుధవారం మండలంలో సమస్యాత్మకమైన పోలింగ్ బూత్‌లను ఆమె తనిఖీ చేశారు. కాటిపేరిలోని 94, 95 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ప్రశాంతంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈవో చంద్రమౌళి ఆమెకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ శివరాముడు, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: పుంగనూరులోని తూర్పుమొగసాల, చింతలవీధి, లినార్డు స్కూల్, ఉబేదుల్లాకాంపౌండ్‌లతో పాటు పుంగనూరు రూరల్ మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అబ్జర్వర్ కవిత పరిశీలించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో మదుసూదన్ రెడ్డి, పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డిలతో ఎన్నికల నిర్వహణపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. అలాగే పోలీసు శాఖ పరిశీలకుడు అరవింద్ హెచ్ సాల్వే, పుంగనూరు స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈవీఎంల భద్రతపై డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డికి పలు సూచనలు చేశారు.

హంస వాహనంపై లక్ష్మీనారాయణుడు

శాంతిపురం, ఏప్రిల్24 : మండల పరిధిలోని కెనమాకులపల్లె గ్రామంలో కొలువైన ప్రసన్న లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్లు హంస వాహనంపై భక్తులను అనుగ్రహించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అమర్ బి.ఫారం అందజేత



పలమనేరు, ఏప్రిల్24 : పలమనేరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అమరనాథరెడ్డి బి.ఫారంను బుధవారం ఇక్కడి న్యాయవాదుల ఎల్.భాస్కర్, జగదీష్‌నాయుడులు ఆర్వో మనోజ్‌రెడ్డికి అందజేశారు.

దాతల సహకారంతో ప్రహరీ నిర్మాణం

పుంగనూరు రూరల్, ఏప్రిల్24: స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద దాత సహకారంతో దాదాపు రూ.3లక్షలతో నిర్మించిన ప్రహరీని బుధవారం అగ్నిమాపక జిల్లా అధికారి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి తోటలు

చౌడేపల్లె, ఏప్రిల్24:చౌడేపల్లె మండలంలో తోటకురప్పల్లె మామిడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం తోటకురప్పల్లెకు చెందిన కమలమ్మ మామిడి తోటలో అగ్గి మంటలు చెలరేగాయి. గుర్తించిన రైతులు వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు. అలాగే రాయలపేట రోడ్డులో ఉన్న మునస్వామి మామిడి తోట కంచె కూడా అగ్ని ప్రమాదానికి గురికాగా వారు మంటలు అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్లు తాగి నిప్పును ఆర్పకుండా వేయటంతో ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలియజేశారు.

నేడు రామచంద్రయాదవ్ నామినేషన్

పుంగనూరు, ఏప్రిల్24: భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ గురువారం పుంగనూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులోని పుంగమ్మ చెరువు కట్టపై నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. నియోజకవర్గంలో పాటు జిల్లా నలుమూలల నుంచే గాక రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, కార్యక్రమానికి తరలివస్తున్నారని తెలిపారు. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సభలో ప్రసంగిస్తానని తెలియజేశారు. నియోజకవర్గానికి అభివృద్ధిలో జరిగిన అన్యాయం, ఇంతవరకు జరిగిన అవినీతిపై మాట్లాడుతామన్నారు. ఇదిలా ఉండగా నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే నియోజకవర్గంలోని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వేలాదిమంది జనం తరలిరానున్నారు. రామచంద్రయాదవ్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పేద, బడుగు బలహీన వర్గాలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని బీసీవై పార్టీ నాయకులు చనకంటి సాంబమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరినాథ్‌రెడ్డిలు విజ్ఞప్తి చేశారు.

పలమనేరు వైసీపీకి కాంగ్రెస్ గుబులు


నామినేషన్ ర్యాలీలో కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్

పలమనేరు, ఏప్రిల్24 : పలమనేరులో వైసీపీకి కాంగ్రెస్ గుబులు పట్టుకొంది. ఇక్కడినుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న బి.శివశంకర్ పలమనేరు సమీపంలోని గంగవరం మండలం నల్లగుట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. టికెట్ పొందినప్పటినుంచి ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ వచ్చారు. అంతేగాక పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బహిరంగ సభకు పెద్దసంఖ్యలో జనసమీకరణ చేసి సభను విజయవంతం చేశారు. ఈ నియోజకవర్గంలో దాదాపు 35 వేల మేరకు మైనారిటీ ఓట్లు, 30 వేలకు పైగా ఎస్సీ ఓట్లు, సుమారు 5వేల లోపు క్రిస్టియన్ ఓట్లు ఉన్నాయి. ఈ ఓటర్లే వైసీపీకి దాదాపు గంపగుత్తగా పడేవి. ఇక బీసీ ఓటర్లు 70 వేలకు పైగా ఉండగా రెడ్డి సామాజికి వర్గానికి చెందిన ఓటర్లు 30 వేల వరకు ఉన్నారు. శివశంకర్‌కు ఇక్కడి మున్సిపాలిటీలోని వైస్ చైర్‌పర్సన్ కుమారుడు అండగా ఉన్నారు. మున్సిపాలిటీలో ఎక్కువగా మైనారిటీలు ఉన్న వార్డుల నుంచి అధికంగా కాంగ్రెస్ ప్రచారానికి కార్యకర్తలను సమీకరిస్తున్నారు. దీంతో శివశంకర్ ప్రచారంలో ఎక్కువగా మైనారిటీలు, బీసీలే ఎక్కువగా కనిపిస్తున్నారు. శివశంకర్ కూడా బీసీ కావడంతో ఆయన బీసీలపై దృష్టిసారించారు. ఇక ప్రధాన రాజకీయ పక్షాల నాయకులకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆర్థిక వనరులు ఉన్నట్లు సమాచారం. దీంతో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే వెంకటేగౌడకు పోలయ్యే మైనారిటీ ఓట్లకు గండిపడే ప్రమాదం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే బీసీల ఓట్లలో చీలిక తెచ్చే అవకాశం ఉంది. ఇక సోషల్‌మీడియా ద్వారా తన ప్రచార కార్యక్రమాలను జనంలో విస్తృతంగా తీసుకెళుతున్నారు. దీంతో వైపీపీకి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్ నుంచి ఎంతోకొంత నష్టం వాటిల్లక తప్పదని పలువురు చెబుతున్నారు. కనీసం ఐదు శాతం ఓట్లు వైసీపీకి గండిపడడం ఖాయమని చర్చ జరుగుతోంది.

ఆరెంజ్ జోన్‌లోకి తవణంపల్లి, శ్రీరంగరాజపురం

24 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత





బోసిపోయిన చిత్తూరు గాంధీసర్కిల్ - టోపి, టవల్ సాయంతో వెళుతున్న పాదచారులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24: ఎండలు మండిపోతున్నాయి. వేడిని తట్టుకోలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. బుధవారం తవణంపల్లె, శ్రీరంగరాజపురం మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే తవణంపల్లెలో 43.5, శ్రీరంగరాజపురం 43.1, పులిచెర్ల 42.9, నింద్ర 42.6, సోమల 41.5, గుడిపాల 41.3, పుంగనూరు 41.2, చిత్తూరు 41.2, యాదమరి 41.2, పలమనేరు 41.1, సదుం 41.0, బంగారుపాళ్యం 40.8, గంగాధరనెల్లూరు 40.5, ఐరాల, రొంపిచెర్ల, చౌడేపల్లి, కార్వేటినగరం, నగరి, పాలసముద్రం 40.4, పెద్దపంజాణి 40.3, కుప్పం 40.2, పెనుమూరు 40.1, వెదురుకుప్పం 40.1, గంగవరంలలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జనసంచారం లేక వీధులన్నీ బోసిపోతున్నాయి.

వడదెబ్బతో మహిళ మృతి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24: మండల పరిధిలోని తడుకు పంచాయతీ వీఎస్ఎస్ పురానికి చెందిన టి.రాజమ్మ బుధవారం వడదెబ్బతో మృతిచెందింది. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న ఆమె ఎండ తీవ్రత భరించలేక ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి - చర్మిళ - రిషిత - కార్తీక్ - గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

రేపు తిరుపతికి ఉప రాష్ట్రపతి రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24: భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ శుక్రవారం తిరుమలకు విచ్చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఉదయం 10.30గంటలకు ఉప రాష్ట్రపతి తిరుపతి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. దర్శనానంతరం బయల్దేరి మధ్యాహ్నం ఒంటి గంటకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే మూడో స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని తిరుగు ప్రయాణం కానున్నారని వివరించారు. ఈ పర్యటన నేపథ్యంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయం చేరుకుని, రాత్రికి తిరుపతిలో బస చేస్తారన్నారు. అలాగే శుక్రవారం ఉపరాష్ట్రపతికి విమానాశ్రయంలో స్వాగతం పలికాక ఉదయం 11.10 గంటలకు బర్డ్ ఆస్పత్రి, శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌ని గవర్నర్ సందర్శిస్తారన్నారు. ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలికాక విజయవాడకు బయల్దేరుతారని కలెక్టర్ తెలియజేశారు. అందువల్ల ఏర్పాట్లకు సంబంధించిన విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. బందోబస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండొద్దని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఆర్వో పెంచలకిషోర్, ఏఎస్పీ కులశేఖర్, రుయా అధికారులు, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, డీఈవో శేఖర్, విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిగారి పీఏనా మజాకా!

విద్యుత్ కనెక్షన్ కోసం అనుమతులు లేకుండా తవ్వేసిన రోడ్డు

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో రాత్రికి రాత్రే పూడ్చివేత





తవ్విన రోడ్డును పూడ్చిన దృశ్యం - లాడ్జి దగ్గర విద్యుత్ కనెక్షన్

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ కీలకమంత్రి దగ్గర వ్యక్తిగత సహాయకుడు (పీఏ). అతడి అల్లుడు లీలామహల్ నుంచి మంగళం రోడ్డులో కొత్తగా లాడ్జి నిర్మించాడు. హైటెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ కనెక్షన్ లాడ్జికి అవసరమైంది. టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రోడ్డు తవ్వేందుకు అనుమతులు తీసుకుని ఎస్పీడీసీఎల్ అధికారులు ఓవర్ హెడ్ మీద ఏర్పాటుచేయవచ్చు. కానీ అక్కడ అమాత్యుల దగ్గర ఉండే వ్యక్తి కదా! ఒక్క ఫోన్ కాల్ చాలు. దగ్గరుండి మరీ పనులు చక్కబెట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్మార్ట్‌సిటీ నిధులతో ఇటీవల వేసిన ఫుట్‌పాత్‌ను పగలగొట్టేశారు. టీటీడీ పర్యవేక్షణలో ఉండే రోడ్డును తవ్వేశారు. అమెరికన్ బార్ దగ్గర నుంచి లాడ్జి ఉండే దాదాపు 300 మీటర్ల వరకు రోడ్డును తవ్వి కనెక్షన్ ఇచ్చారు. ఇదిగమనించిన కొందరు సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. తేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు రాత్రికి రాత్రే గుంతలు పూడ్చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు కూడా ఎస్పీడీసీఎల్ అధికారులు ఇలా ఏకపక్షంగా వ్యవహరించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఈ శునకం ధర రూ.20కోట్లు



వరదయ్యపాళెం, ఏప్రిల్ 24 : వరదయ్యపాళెంలోని ఏకం ఆధ్యాత్మిక క్షేత్రంలో బుధవారం సాయంత్రం రూ.20 కోట్ల ధర పలికే ఓ శునకం అందరినీ ఆకర్షించింది.ఏకం సందర్శనకు వచ్చిన బెంగళూరుకు చెందిన ఇండియన్ డాగ్ బ్రీడర్ అసోసియేషన్ అధ్యక్షుడు,టీవీ నటుడు అయిన సతీష్ ఈ శునకాన్ని తీసుకొచ్చారు. కాకాసియన్ షెపర్డ్ జాతికి చెందిన ఈ కుక్కను శునక ప్రేమికుడైన సతీష్ పెంచుకోవడంతో పాటు ఊరూరా తిప్పుతున్నారు.

వైసీపీ దౌర్జన్య కాండ

ప్రచారం ముసుగులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు

ఆపై ఘర్షణకు దిగడంతో ఓ కార్యకర్తకు గాయాలు





దొడ్డాపురం వీధిలో ఉద్రిక్త పరిస్థితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24: తిరుపతిలో ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఎన్డీయే కూటమి అభ్యర్థి తరపున ప్రచారం చేసే నాయకులు, కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు వెంటాడుతున్నారు. బుధవారం 27వ డివిజన్‌లోని దొడ్డాపురం వీధిలో టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. వైసీపీ తరపున ప్రచారం చేస్తున్న వేణు, ధీరజ్, కార్పొరేటర్ శైలజ, పునీతమ్మ, ఉష, నరసింహ తదితరులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొంత పక్కకు తప్పుకుంటే తాము ప్రచారం చేసుకుంటామని టీడీపీ, జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. కానీ వైసీపీ నాయకులు మెట్టు దిగకపోవడంతో అక్కడ కాసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెరోవైపు మళ్లించేందుకు యత్నించారు. అయినా స్థానిక వైసీపీ నాయకులు ఉదయ్ వంశీ, సురేష్, ముద్ర ప్రసాదు, తదితరులు మరోసారి రెచ్చగొడుతూ ఎన్డీయే కార్యకర్తలపైకి దూసుకొచ్చేందుకు యత్నించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఎన్డీయే కార్యకర్త ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. ఓ పార్టీ ప్రచారం చేస్తుండగా మరో పార్టీకి పోలీసులు ఎలా అనుమతిస్తారని ఎన్డీయే నాయకులు ప్రశ్నిస్తున్నారు.

జబ్బారు లేఅవుట్‌లోనూ..

తిరుపతి జబ్బారు లేఅవుట్‌లో ఎన్డీయే కూటమి నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో వైసీపీ శ్రేణులు దాడికి యత్నించాయి. 26వ డివిజన్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారం చేస్తుండగా స్థానిక కార్పొరేటర్ ఆఫీసు వద్ద వైసీపీ కార్యకర్తలు ప్రచారం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అయినా శాంతియుతంగా ఎన్డీయే ప్రచారం చేయడంతో ఎటువంటి వివాదం తలెత్తలేదు.

చంద్రగిరిలోనూ వైసీపీ రగడ

టీడీపీ కళా బృందం ప్రదర్శనలో వైసీపీ ప్రచార రథం



టీడీపీ కళాబృందం వద్ద పెట్టిన వైసీపీ ప్రచార వాహనం

చంద్రగిరి, ఏప్రిల్ 24: చంద్రగిరిలోనూ టీడీపీ నేతలతో బుధవారం వైసీపీ శ్రేణులు రగడకు దిగాయి. గురువారం చంద్రగిరి టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమం పెట్టుకున్నారు. ఈ క్రమంలో తమ అభ్యర్థి నాగాలమ్మ ఆలయంలో పూజలు చేస్తారని చెప్పి తొండవాడ పంచాయతీ పరిధిలో ఉన్న ఉగ్ర ప్రత్యంగిరా దేవాలయం నుంచి చంద్రగిరి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వైసీపీ జెండాలను పాతేశారు. అలాగే టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని కూడా నాగాలమ్మ ఆలయంలో పూజలు చేసి, నామినేషన్‌కు వెళ్లనుండటంతో టీడీపీ జెండాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం టీడీపీ జెండాలను తొలగించాలంటూ వైసీపీ శ్రేణులు పట్టుబట్టాయి. పైగా తమ జెండాలు పాతడానికి అనుమతి ఉందంటూ వైసీపీ శ్రేణులు రగడకు దిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులొచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపేశారు.ఆ తర్వాత కూడా.. టీడీపీ కళాజాత బృందం ప్రదర్శన చంద్రగిరి ఫ్లైఓవర్ వద్ద జరుగుతుండగా వైసీపీ ప్రచార వాహనాన్ని కూడా అక్కడే పెట్టి సౌండ్ పెంచారు.విషయం తెలుసుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అక్కడికి వచ్చి వైసీపీ ప్రచార రథం తీసుకెళ్లిపోవాలని చెప్పినా వినిపించుకోలేదు. చివరకు పోలీసులు రావడంతో వైసీపీ ప్రచార రథం అక్కడినుంచి తీసుకెళ్లిపోయారు.

రామకుప్పం ఎస్‌ఐని తొలగించాలి : టీడీపీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, ఏప్రిల్ 24: రామకుప్పం ఎస్‌ఐ శివకుమార్ వైసీపీకి కొమ్ముకాస్తూ తమ పార్టీ శ్రేణులను వేధిస్తున్నారని ఆయన్ను తొలగించి వేరొకరిని ఎస్‌ఐగా నియమించాలని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. బుధవారం వారు రామకుప్పంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడు నెలలుగా ఆయన మండలంలో టీడీపీ కార్యకర్తలను, ఎస్సీ, ఎస్టీలను వేధిస్తున్నారని తెలిపారు. సెర్చ్ వారెంట్లు లేకుండా ఇళ్లలో సోదాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తాజాగా బల్ల గ్రామంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు ఎర్రప్ప కర్ణాటక మద్యం అమ్ముతున్నాడంటూ బెదిరించి ఇంట్లో సోదాలు చేసి అవమానించారని తెలిపారు. ఆయన ఇంట్లో మద్యం లేకపోవడంతో, అతని సెల్‌ఫోన్‌పై టీడీపీ స్టిక్కరును చూసి 'ఓహో నువ్వు తెలుగుదేశమా, నీ కథ చూస్తా' అంటూ బెదిరించారన్నారు. రాజుపేటలో చంద్రబాబు జన్మదినోత్సవాన్ని నిర్వహించిన పంచాయతీ పార్టీ అధ్యక్షుడు నారాయణస్వామితో బాటూ ఇతరులపై కేసు నమోదు చేశారన్నారు. 89పెద్దూరులో చంద్రబాబు నామినేషన్ ర్యాలీకి వెళ్లారని నస్రూల్ అనే వైసీపీ కార్యకర్తతో బాటు అతని భార్య, సోదరుడిపై వైసీపీ నేతలు దాడి చేస్తే వారు పోలీసులను ఆశ్రయించారన్నారు. బాధితుల తరపున నిలబడాల్సిన ఎస్‌ఐ వైసీపీ నేతల తరపున మాట్లాడారని తెలియజేశారు. కావలిమడుగుకు చెందిన టీడీపీ కార్యకర్తలను వైసీపీ చేరాలని బెదిరించారన్నారు. మండలంలో మద్యం, గంజాయి, సారా విక్రయాలు అరికట్టకుండా వైసీపీ సేవలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ స్పందించి శివకుమార్‌ను ఎస్‌ఐ విధుల నుంచి తప్పించాలని కోరారు.

రేపు సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం

ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి - 67మందికి బంగారుపతకాలు, 580మందికి డిగ్రీలు ప్రదానం



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 24: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు యూనివర్సిటీలోని ఇండోర్‌స్టేడియం జరగనుంది. చాన్సలర్ ఎన్.గోపాలస్వామి అధ్యక్షతన జరిగే ఈస్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ హాజరవుతున్నారని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ మాట్లాడుతూ.. సెంట్రల్‌వర్సిటీ హోదా పొందాక నిర్వహించే ఈ స్నాతకోత్సవం ప్రత్యేకమైందని చెప్పారు. 2022-23 విద్యాసంవత్సరంలో వర్సిటీలో పలు యూజీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన 580మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి, ప్రథమస్థానం సాధించిన 67మందికి బంగారుపతకాలను ఉప రాష్ట్రపతి అందిస్తారని చెప్పారు. విశిష్ట అతిథిగా ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య హాజరై.. భారతీయ జ్ఞానపరంపరకు సంబంధించి రచించిన పలు పుస్తకాలను విడుదల చేస్తారని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, సీవోఈ డాక్టర్ కె.సాంబశివ మూర్తి, ఏపీఆర్వో డాక్టర్ కనపాల కుమార్, డాక్టర్ బుల్టీదాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన సంఘమిత్ర తొలగింపు

కల్లూరు, ఏప్రిల్ 24: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి సంఘమిత్ర కె.దివ్యను విధుల నుంచి తొలగిస్తూ డీఆర్‌డీఏ పీడీ తులసి ఉత్తర్వులు జారీ చేసినట్లు పులిచెర్ల ఏపీఎం మధుసూదన్ బుధవారం తెలిపారు. ఈనెల 17న మండలంలో నిర్వహించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచార సమావేశంలో ఆమె పాల్గొనడంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిందంటూ స్థానిక టీడీపీ నేత గోపినాయుడు 18న ఎంపీడీవో సురేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు దివ్య సంజాయిషీని డీఆర్‌డీఏ పీడీకి సమర్పించారు. ఆమెను విధుల నుంచి తొలగిస్తూ డీఆర్‌డీఏ పీడీ ఉత్తర్వులిచ్చినట్లు ఏపీఎం తెలిపారు.

కావలిమడుగులో సీఐ విచారణ

రామకుప్పం, ఏప్రిల్ 24: వైసీపీ నేతల ప్రోద్బలంతో రామకుప్పం ఎస్‌ఐ తమను వేధిస్తున్నారంటూ మండల పరిధిలోని పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగు గ్రామానికి చెందిన వడివేలు, తంగవేలు, రాజ్‌కుమార్, కార్తీక్ మంగళవారం కుప్పం డీఎస్పీ శ్రీనాథ్‌కు పిర్యాదు చేశారు. దీనిపై బుధవారం రాత్రి కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి కావలిమడుగుకు చేరుకుని విచారణ జరిపారు. కుప్పంలో చంద్రబాబు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కావలిమడుగు నుంచి వంద మంది వెళ్లామని, ఆ మరుసటి రోజు రామకుప్పం ఎస్‌ఐ సిబ్బందితో కలిసి తమ ఇళ్లలో సోదాలు నిర్వహించారని వారు సీఐ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. అంతేగాక టీడీపీ కార్యక్రమానికి ఎందుకు వెళ్లారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కథ చూస్తానంటూ బెదించారని వారు సీఐ ఎదుట వాపోయినట్టు తెలిసింది. సోమవారం సాయంత్రం ఎస్‌ఐ మళ్లీ వచ్చి కుటుంబసభ్యుల ముందే అసభ్య పదజాలంతో దూషించారని. తమ వద్ద ఉన్న నాటు తుపాకులు మంగళవారం ఉదయం 10గంటల్లోపు అప్పగించకపోతే అంతు చూస్తానని బెదిరించారని చెప్పినట్లు తెలిసింది.

జెస్సిక మృతి



జెస్సిక(ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జెస్సిక మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణంలోని తూర్పుమొగసాలకు చెందిన ప్రేమ్‌కుమార్, సుభాషిణి దంపతుల కుమార్తె జెస్సిక(7) కిడ్నీ వ్యాధితో కొన్ని రోజులుగా విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన ఆ దంపతులు ఇంకా అవసరమైన డబ్బు కోసం దాతల సాయం కోరారు. ఈ క్రమంలో ఆ చిన్నారి మృతిచెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి.

చిత్తూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జగపతి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జగపతి పేరును కాంగ్రెస్ అధిష్టానం బుధవారం ఖరారు చేసింది. మొదటి జాబితాలో 2019 ఎన్నికల్లో పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చిట్టిబాబుకు 2024 ఎన్నికల్లో చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. 25న నామినేషన్ల గడువు ముగియనుండగా అనూహ్యంగా జగపతి పేరును బుధవారం రాత్రి కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎంటీ టీకా రామన్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.3.09 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.09 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ప్రకటించింది. మంగళవారం 60,371 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,301 మంది తలనీలాలు సమర్పించారు.

ఏడు అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంట్ స్థానాల్లో

అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నాం

- చంద్రబాబు చరిష్మా, లోకేష్ పాదయాత్ర, కూటమి కలయికతో గ్రాఫ్ పెరిగింది
- ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ఆదికేశవులు శ్రద్ధాంజలి సభలో దగ్గుమళ్ల



తేనెబండ వీరబ్రహ్మేంద్రస్వామి కూడలి వద్ద జరిగిన చర్చా వేదికలో ప్రసాదరావు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 24: రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నామని కూటమి చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కూటమి చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నామినేషన్ కార్యక్రమంలో భాగంగా దగ్గుమళ్ల మీడియాతో మాట్లాడారు. ఇప్పటికి ఐదుగురు ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి నామినేషన్ వేశామన్నారు. అన్నిచోట్ల 35 వేల నుంచి 40 వేల మంది వరకు హాజరయ్యారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తే ఎన్డీయే కూటమికి అత్యధిక మెజారిటీ వస్తుందనే నమ్మకం కలిగిందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు, లోకేష్ పాదయాత్ర, భువనేశ్వరమ్మ నిజం గెలవాలి యాత్ర ప్రజల్లో టీడీపీ గ్రాఫ్ పెంచిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో కూటమి అభ్యర్థుల గెలుపు నల్లేరు మీద నడకేనన్నారు. ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ గెలిచి, చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. చిత్తూరుకు స్టార్ క్యాంపెయినర్లు ఎవరైనా వస్తున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు నందమూరి బాలకృష్ణ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వస్తున్నారని సమాధానమిచ్చారు. 1981-83లో బాలకృష్ణ తను కలిసి చదువుకున్నామని, ఎన్నికల ప్రచారానికి రావాలని ఆహ్వానించగా కచ్చితంగా వస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలుస్తుందని, ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున మెజారిటీ పెంచుకోవడానికి ఉపయోగిస్తామని చెప్పారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో గెలిచి చరిత్రను తిరగ రాస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. స్టేట్, సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి చిత్తూరును ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, ఏఎస్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాధేయ్



గెలుపులో మహిళా ఓటర్లే కీలకం

మహిళా ఓట్లు: 7,88,725

పురుష ఓట్లు: 7,65,903

30-39 ఏళ్ల వయసున్న ఓటర్లే అధికం

జిల్లాలో మొత్తం 15,54,712 మంది ఓటర్లుండగా, 30-39 మధ్య వయసున్నవారే ఎక్కువగా 4,06,176 మంది ఉన్నారు.

● తొలిసారి ఓటేసేవారు (18-19 ఏళ్ల వయసు) 33,495 మంది ఉన్నారు.

- చిత్తూరు కలెక్టరేట్



బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తుంటారు. బైండోవర్ అంటే (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అని అర్థం. ఎన్నికల వేళ ఎవరి వల్లనైనా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే పోలీసులు బైండోవర్ చేస్తారు. అనంతరం తహసీల్దార్ లేదా ఆర్డీవో వద్ద హాజరు పరుస్తారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించబోమని అతడి నుంచి బాండ్ పేపర్‌పై లిఖితపూర్వకంగా తీసుకుని అతడికి సంబంధిత తహసీల్దార్లు ప్రొసీడింగ్స్‌ను ఇస్తారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి అదే రోజు నుంచి ఏడాది వరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే లిఖితపూర్వకంగా ఇచ్చిన బాండులో ఎంత మొత్తం నమోదు చేసి ఉన్నారో అంతమొత్తం పెనాల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంది. అలా చెల్లించకపోయినా నేరం కిందనే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద రెండు, అంతకన్న ఎక్కువసార్లు బైండోవర్ అయితే అతడిపై రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. తమపై అక్రమంగా పోలీసులు బైండోవర్ కేసులు పెట్టారని ఎవరైనా పౌరులు భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చు. పోలీసులకు నోటీసులు కోర్టు జారీచేసి రెండు వర్గాల వాదనలు విన్నతరువాత కేసుపై నిర్ణయం తీసుకుంటుంది.

- చిత్తూరు

జన కేతనం



ప్రభుత్వ బడుల్లో తగ్గిన 16 వేల మంది

పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలోని 2468 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1,69,191 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంఖ్య 2023-24 విద్యా సంవత్సరం నాటికి 1,52,557కి పడిపోయింది. ఏడాదిలోనే 16,634 మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. అదే సమయంలో ప్రైవేటు బడుల్లోని విద్యార్థుల సంఖ్య 2022-23 నాటికి 32792 మంది ఉండగా, 2023-24 నాటికి ఈ సంఖ్య 37772కు చేరింది. అంటే.. ప్రభుత్వ బడులకు దూరమైన విద్యార్థుల్లో 4980 మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారని భావించొచ్చు. మిగిలిన 11,811 మంది విద్యార్థులు బడుల విలీనం కారణంగానే విద్యకు దూరమయ్యారనే చర్చ సాగుతోంది.




ఐరాల మండలం భీమినేనివారిపల్లెలో..



కార్వేటినగరం మండలంలో కలికిరి ఇండ్లులో మూతబడిన పాఠశాల

దీన్నేమంటారు జగన్ మామా..!



అంటరానితనం తన రూపం మార్చుకుంది. పేదలను దూరంగా ఉంచడం మాత్రమే అంటరానితనం కాదు. పేదవారు ఇంగ్లీషు మీడియం చదవొద్దని కోరుకోవడం కూడా అంటరానితనమే.

- విజయవాడలో జనవరి 19న అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలివీ.

ప్రభుత్వం తీసుకున్న పాఠశాలల విలీనం నిర్ణయంతో జిల్లాలో 16,634 మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారు. వీరిలో కొందరు ప్రైవేటు స్కూళ్లలో చేరితే.. మిగిలిన వారు చదువు మానేశారు. ఇలా చదువుకు దూరం చేయడాన్ని ఏమంటారు జగన్ మామా.. అంటూ ప్రశ్నిస్తున్నారు ఆ నిరుపేద విద్యార్థులు. ఇదీ రూపుమార్చుకున్న అంటరానితనం కాదా అని నిలదీస్తున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

● విలీనంతో ప్రభుత్వ బడులకు పేద విద్యార్థులు దూరం

● ప్రైవేటుకు కొందరు.. చదువుకోలేక మరికొందరు

జగన్ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్య గాడి తప్పింది. నాడు- నేడుతో బడుల రూపు మార్చామని చెప్పినా.. స్కూళ్ల విలీనంతో పేద విద్యార్థులకు చదువును దూరం చేశారు. ఉమ్మడి జిల్లాలో 2021లో బడుల విలీన ప్రక్రియ మొదలుపెట్టి 2023 విద్యా సంవత్సరానికి ముగించారు. 2021 ఆగస్టు 10లోపు 20 బడులను విలీనం చేశారు. 2021-22లో 4832 ప్రభుత్వ పాఠశాలల్లో 3,75,061 మంది విద్యార్థులు ఉన్నారు. 2022 ఫిబ్రవరిలో తొలి విడతగా 316 ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 చదువుతున్న 18207 మంది విద్యార్థులను మూడు కిలోమీటర్ల సమీపంలోని 312 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఒకటి, రెండు తరగతులున్న పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేశారు. 2022-23లో 2297 ప్రాథమిక పాఠశాలల్లోని 1.20 లక్షల మంది విద్యార్థులను 572 ఉన్నత పాఠశాలల్లోకి సర్దుబాటు చేశారు. మొత్తంగా విలీనం ప్రక్రియ లెక్కల సవరణలు అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 421 పాఠశాలలు విలీనం చేశారు. వీటిలో 225 చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.

టీచర్ల కొరతను సర్దుబాటు చేసేశారు

విద్యా సంవత్సరం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు	టీచర్లు
2019-20	4904	3,43,683	17,230
2020-21	4853	3,66,586	17,233
2021-22	4832	3,75,061	17,454
జిల్లా విభజన తర్వాత			
2022-23	2468	1,69,191	8,466
2023-24	2455	1,52,557	8,680

జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. ఉన్న టీచర్లు పదవీ విరమణ చెందడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీన్ని పూడ్చేందుకు 2021లో 2008 డీఎస్సీలోని 214 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను మినిమం టైం స్కేల్ కింద విధుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత ఇదే డీఎస్సీలోని మరో 54 మందిని 2023లో రిక్రూట్ చేసుకుంది. అప్పటికీ టీచర్ల కొరత తీరకపోవడంతో 2023లో 1998 డీఎస్సీలోని 614 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను ఎంటీఎస్ కింద విధుల్లోకి తీసుకుంది. ఇలా మొత్తంగా 882 మంది టీచర్లను ఎంటీఎస్ కింద నియామకం చేపట్టారు. బడుల విలీనంతో టీచర్ల సర్దుబాటు చేశారు. ఇలా ఐదేళ్లుగా విద్యా వ్యవస్థను పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ బడుల్లో చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవడంతోనూ కొన్ని పాఠశాలలు మూతపడ్డాయి.



చిన్నబొమ్మయ్యపల్లెలో మూతపడిన బడి

విద్యార్థులు బడికి రాక..!

వెదురుకుప్పం మండలంలో విద్యార్థులు రాకపోవడంతో చిన్నబొమ్మయ్యపల్లె, గంటావారిపల్లె, సద్దికూళ్లపల్లె, తోటానంపల్లి, వావిలిచేను ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. ఆయా పాఠశాలల పరిధిలో బడి ఈడు పిల్లలున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల నుంచి విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజన వసతి తదితరాలు కల్పిస్తున్నా.. లోపం ఎక్కడుందో గానీ వీరంతా ఇక్కడ చదివేందుకు ఇష్టపడలేదు. దీనికి కారణం విద్యావ్యవస్థ గాడి తప్పడం అన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలో వీరంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరడంతో మూతపడ్డాయి. వాస్తవానికి ఆయా పాఠశాలల పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిన క్షేత్రస్థాయి ఉద్యోగులు కూడా మొక్కుబడిగా చేతులు దులుపుకొన్నారని ఆయా గ్రామస్తులు అంటున్నారు.


- వెదురుకుప్పం

మూత దిశగా ఆరు పాఠశాలలు

గుడిపాల మండలంలోని డీబీపల్లి (దక్షిణబ్రాహ్మణపల్లె), తుమ్మలవారిపల్లె, చలిచీమలపల్లె, పాపిశెట్టిపల్లె (తెలుగు, తమిళ్), తిమ్మయ్యపల్లె, నారగల్లు పాఠశాలలు మూతపడే దశలో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఇద్దరు చొప్పున విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కో టీచరు వంతున విధులు నిర్వహిస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఈ పాఠశాలలు మూతబడే అవకాశముంది.

- గుడిపాల

ఇద్దరికే పరిమితమైన దక్షిణ బ్రాహ్మణపల్లె పాఠశాల



కొక్కువారిపల్లెలో మూత'బడి'

● ఆ దిశగా మరో ఏడు ప్రాథమిక పాఠశాలలు



పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. గతేడాది పాఠశాల పునఃప్రారంభంలోనే విద్యార్థులు లేరిక్కడ. కొవిడ్ అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3280 మంది విద్యార్థులు చదువుతుండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 2788కి పడిపోయింది. ఇక, కూనపల్లెలో నలుగురు, వీసీ వడ్డిపల్లెలో 8, రాజులపల్లె 10, వీకే పల్లె 10, బండారువారిపల్లెలో నలుగురు, చెన్నుపాటివారిపల్లెలో 7, దిన్నెపాటివారిపల్లె 7 మంది చొప్పున విద్యార్థులున్నారు. దీంతో ఈ ఏడు పాఠశాలల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారనుంది.

- కల్లూరు

చిత్తూరు పార్లమెంటు వర్తమానం

కంచుకోటలో దూసుకెళ్తున్న టీడీపీ

● అటు స్వతంత్రంగా.. ఇటు ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయంగా ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రచారం

● ఈ ఐదేళ్లూ డమ్మీ ఎంపీగా పేరుగాంచిన వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత చిత్తూరు లోక్‌సభకు పదిసార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాంటి కంచుకోటలో ఈసారి జెండా ఎగరేయాలని టీడీపీ కృతనిశ్చయంతో ఉంది. మరోవైపు ఈ ఐదేళ్లూ రెడ్డెప్ప డమ్మీ ఎంపీగా మిగిలిపోయారు. తాను మాత్రం డమ్మీగా ఉండబోనని.. సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో పోరాడతానంటూ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చెబుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

తెలుగుదేశం పార్టీ తరఫున చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు మాజీ ఐఆర్ఎస్ అధికారి. ఈయన పలు రాష్ట్రాల్లో ఇన్‌కమ్‌ట్యాక్స్ జాయింట్ కమిషనరుగా పనిచేసి ముందస్తు పదవీ విరమణ పొందారు. హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న రాధే కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు చిత్తూరుకు పంపించారు. ఈయన అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచీ తనదైన శైలిలో ఎమ్మెల్యే అభ్యర్థులను కలుపుకొని ముందుకు వెళ్తున్నారు. కుప్పం నుంచి చంద్రగిరి వరకు రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నివాసం, కార్యాలయాన్ని ప్రారంభించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. తక్కువ కాలంలోనే సౌమ్యుడిగా పేరు సంపాదించుకున్నారు.



టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

అటు సమన్వయంతో..

కుప్పం నియోజకవర్గంలో ఈసారి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంతో శ్రేణులు పనిచేస్తున్నాయి. ఇక్కడ వచ్చే మెజారిటీనే ఎంపీ అభ్యర్థి విజయానికి కలిసొచ్చే అంశం. కుప్పం, పలమనేరు, పుత్తూరు ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఈయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు పరిచయం చేశారు. పలమనేరులో అమరనాథరెడ్డి, చిత్తూరులో గురజాల జగన్మోహన్, పూతలపట్టులో మురళీమోహన్, జీడీనెల్లూరులో థామస్, నగరిలో గాలి భానుప్రకాష్, చంద్రగిరిలో పులివర్తి నానిని సమన్వయం చేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులందరి నామినేషన్ల కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఇలా ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకుంటూనే మరోవైపు తన టీమ్‌తో ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు రాధే, ఇతర కుటుంబ సభ్యులూ విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో టీడీపీకి అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి.



పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న రెడ్డెప్ప

రెడ్డెప్పపై దళిత సంఘాల్లో ఆగ్రహం

ఇక, తాజా ఎంపీ, వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడు. ఆయన చెప్పింది ఈయనకు వేదం. ఈ ఐదేళ్లూ డమ్మీగానే ఉన్నారు. ఇటీవల మదనపల్లెలో బీఫాం తీసుకుని ఆయన మంత్రి పెద్దిరెడ్డి కాళ్లు మొక్కడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారంటూ ఆ సంఘాల నేతలు మండిపడుతున్నారు. 2019 ఎన్నికల్లోనూ పెద్దిరెడ్డి ఈయనకు టికెట్ ఇప్పించారు. అప్పటి గాలిలో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ మీద రెడ్డెప్ప గెలిచారు. పుంగనూరుకు చెందిన ఈయన.. అసలు చిత్తూరుకు ఎంపీ ఉన్నారనే విషయమే ప్రజలకు గుర్తు లేనంతగా ఆయన వ్యవహరించారు. అంతలా డమ్మీ ఎంపీగా ఉన్న ఆయన్ను ఈసారి తొలుత జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్చి, మళ్లీ చిత్తూరు అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల తరహాలో స్వతంత్రత కలిగిన వ్యక్తిగా కాకుండా, రెడ్డెప్ప పూర్తిగా మంత్రి పెద్దిరెడ్డిపైనే ఆధారపడి ముందుకు సాగుతున్నారు.

తన కుమారుడిని ప్రాణాపాయం నుంచి శత్రువు కాపాడాడని తెలిసి రగిలిపోతాడు. అలాంటి ప్రాణం వద్దని కొడుకునే చంపేస్తాడు.

- ఇదీ 'ఇంద్ర' సినిమాలో ఓ సన్నివేశం.



కుప్పంలో అన్న క్యాంటీన్ నిర్వాహకులతో గొడవ పడుతున్న వైసీపీ శ్రేణులు

ఆకలి పార్టీ ఎరుగదు

వైసీపీ శ్రేణుల కడుపునింపిన అన్నా క్యాంటీన్

మావాళ్ల కడుపు నింపితే ఖబడ్దార్ అంటూ అధికార పార్టీ నేతల గొడవ

అన్న క్యాంటీన్ నిర్వాకులతో గొడవపడ్డ వైసీపీ శ్రేణులు

ఇప్పుడు కుప్పానికి వస్తే..

బుధవారం వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రేణులకు సమయానికి బిర్యానీ ప్యాకెట్లు అందలేదు. ఆకలి పార్టీ ఎరుగదు అన్నట్లు.. వీరంతా టీడీపీ శ్రేణులు అన్నా క్యాంటీన్‌లోకి తమ జెండాలతో దూరారు. 'మావాళ్ల కడుపు నింపితే ఖబడ్దార్' అంటూ అధికార పార్టీకి చెందిన ఇంకొంతమంది కార్యకర్తలు క్యాంటీన్ నిర్వాహకులతో గొడవకు దిగారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా బుధవారం ఆ పార్టీ కుప్పంలో ర్యాలీ నిర్వహించింది. జన సమీకరణకోసం డబ్బు, మద్యం, బిరియానీ.. అంటూ ఏవో ఏర్పాట్లు చేసింది కానీ, కార్యకర్తలకు అవి అందేసరికి చాలా ఆలస్యమే అయింది. ముఖ్యంగా దూర ప్రాంతాలనుంచి ఎప్పుడో వచ్చిన సామాన్య కార్యకర్తలకు మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యేసరికి ఆకలి మొదలైంది. అప్పటికి ర్యాలీ పట్టణంలో కొనసాగుతోంది. అదే సమయంలో ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం జరుగుతోంది. దీంతో కొంతమంది కార్యకర్తలు తామున్న పార్టీ కానీ, ఉన్నది ఆ పార్టీ ర్యాలీలో అని కానీ మరచిపోయారు. చేతిలో ఉన్న వైసీపీ జెండాలను అలాగే పట్టుకుని అన్నా క్యాంటీన్ దగ్గరకు చేరుకున్నారు. తట్టలను పట్టుకుని గుంపులుగా అన్నంకోసం ఎగబడ్డారు. పాపం.. అకలిమీదున్నారు. పార్టీ ఏదైతే ఏమిటి.. అనుకున్న టీడీపీ శ్రేణులు వారికి కడుపారా అన్నం పెట్టి ఆకలి తీర్చాయి. తమ పార్టీ కార్యకర్తలు అన్నా క్యాంటీన్‌లో కడుపు నింపుకోవడం చూసిన ర్యాలీలోని కొందరు నాయకులు, ఇతర కార్యకర్తలను ఉసిగొలిపారు. వాళ్లంతా అన్న క్యాంటీన్ నిర్వాహకులైన టీడీపీ శ్రేణులపై విరుకుపడ్డారు. 'మావాళ్ల ఆకలి తీరుస్తారా? మీ అంతు చూస్తాం'టూ గొడవకు దిగారు. 'ఇదేం చోద్యం? ఆకలికి పార్టీలు ఉంటాయా? అకలి అని వచ్చినవారికి ఇంత అన్నం పెట్టి కడుపు నింపడం కూడా తప్పేనా?' అంటూ ఆ పరిసరాల్లోని జనం నోళ్లు నొక్కుకున్నారు. చివరకు భోజనం చేస్తున్న వైసీపీ కార్యకర్తలే తిరగబడడంతో గొడవకు దిగిన ఇతర కార్యకర్తలు సైలెంటైపోయారు. ఆ తర్వాత ఇంకెవరూ అన్నా క్యాంటీన్‌వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- కుప్పం

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి






చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నామినేషన్ ర్యాలీలో జన సందోహం - గురజాల, దగ్గుమళ్ల ఆత్మీయ పలకరింపు - కేరళ డ్రమ్స్ వాయిద్యాల సందడి, ర్యాలీగా వస్తున్న తెలుగు మహిళా నాయకురాళ్లు

పసుపుదళంతో కిక్కిరిసిన చిత్తూరు

- అట్టహాసంగా టీడీపీ అభ్యర్థి గురజాల నామినేషన్
- విజయోత్సవాన్ని తలపించిన నామినేషన్ ర్యాలీ
- ఎర్రచందనమే విజయానందరెడ్డి ఇంధనం : గురజాల

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 24: చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నామినేషన్ కార్యక్రమం విజయోత్సవ ర్యాలీని తలపించింది. నగరమంతా పసుపుమయంగా మారింది. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్లతో పాటు నాయకులు దొరబాబు, సీకే బాబు, ఏఎస్ మనోహర్, సీఆర్ రాజన్, హేమలతతో కలిసి దర్గా సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. జేసీ శ్రీనివాసులుకు నామినేషన్ పత్రాలను అందించారు. నగరంలోని బీవీరెడ్డి కాలనీలో ఉన్న తన నివాసం నుంచి బుధవారం ఉదయం బయల్దేరిన గురజాల జగన్మోహన్ స్థానిక కట్టమంచిలోని విఘ్నేశ్వరాలయం, సాయిబాబా ఆలయం, పొన్నియమ్మ ఆలయం, వీరాంజనేయ స్వామి ఆలయాలతో పాటు అంబేద్కర్ సర్కిల్‌లోని దర్గాలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీయార్ విగ్రహానికి, నగరంలోని గాంధీ విగ్రహం, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. చిత్తూరు నియోజకవర్గం నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా దర్గా సర్కిల్ నుంచి గిరింపేట సర్కిల్, దుర్గమ్మ గుడి, పీవీకేఎన్ కళాశాల, మీదుగా కలెక్టరేట్ వరకు సాగిన ర్యాలీలో శ్రేణులు ఉత్సాహంతో వెంట నడిచారు. ప్రచార రథంలో వస్తున్న గురజాల జగన్మోహన్, ఇతర నేతలకు రోడ్డు పొడవునా అభిమానులు మంగళహారతులు, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, కేరళ డ్రమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దొరబాబు, సీకే బాబు, హేమలత, సీఆర్ రాజన్‌లతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

ర్యాలీకి వెళ్లకుండా ప్రజలను అడ్డుకున్న వైసీపీ నేతలు

టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలను, అభిమానులను, సామాన్యులను గురజాల నామినేషన్‌లో పాల్గొనకుండా స్థానిక వైసీపీ నేతలు అడుగునా అడ్డంకుల సృష్టించారు. కొండమిట్ట తదితర ప్రాంతాల్లో ర్యాలీకి వెళుతున్న టీడీపీ కార్యకర్తలను ప్రజలను వైసీపీ నేతలు అడ్డుకున్నారు. ర్యాలీకి వెళితే సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని, ఇళ్లకు విద్యుత్ సరఫరా, నీటి సరఫరా నిలిపివేస్తామని బెదిరించారు. అయినా ప్రజలు వైసీపీ నేతలను ఎదిరించి ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

గురజాల జగన్మోహన్ నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కోదండయాదవ్, కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్, ఆర్ గాంధీ, వసంత్ కుమార్, జయచంద్ర నాయుడు, సుబ్బానాయుడు, గోళ్ళ హేమాద్రి నాయుడు, శశికర్‌బాబు, రాజశేఖర్.. బీజేపీ నేతలు జగదీశ్వర్ నాయుడు, అట్లూరి శ్రీనివాసులు, బాబు ప్రసాద్ రెడ్డి.. జనసేన నేతలు ఆరణి కవిత, యశ్వంత్, లోచన్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ రంగులతో ప్రత్యేక వేషధారణలో కళాకారులు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

ఇన్నర్ రింగు రోడ్డుకు కృషి

నామినేషన్ అనంతరం గురజాల జగన్మోహన్ విలేకరులతో మాట్లాడుతూ.. 'చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాది. గడప గడపకు తిరుగుతున్నపుడు ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నాను. ఐదేళ్ళ వైసీపీ పాలనలో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చిత్తూరులో యూనివర్సిటీ, ఐఐటీ, నవోదయ, కేంద్రీయ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషిచేస్తాం. ● పట్టణ ప్రజల దాహార్తి తీర్చడం కోసం అడవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తాం. నగరంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేసి నగరాన్ని గ్రీన్ సిటీగా మారుస్తాం. నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు, ఇండస్ట్రియల్ హబ్, గుడిపాల మండలంలో గార్మెంట్స్, షూ కంపెనీలు ఏర్పాటుచేసి స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి, ప్రభుత్వాసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం. చిత్తూరు రూరల్, గుడిపాల ప్రభుత్వాసుపత్రులను వంద పడకలుగా అభివృద్ధి చేస్తాం. ● తేనెబండ నుంచి తోటపాళ్యం వరకు నీవానదికి ఇరువైపులా వరద ముంపునకు గురికాకుండా రక్షణ గోడ నిర్మాణం, కట్టమంచి చెరువు అభివృద్ధితోపాటు జిల్లాకు సేవలందించిన గొప్పవ్యక్తుల విగ్రహాలు ఏర్పాటు చేసి మిని ట్యాంక్ బండ్ నిర్మిస్తాం.● ఎన్టీయార్ సుజల సురక్షిత తాగునీటి పథకం కింద ఉచిత మినరల్ వార్ ప్లాంట్‌ల ఏర్పాటు, గుడిపాలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా దగ్గుమళ్ళ ప్రసాదరావును భారీమెజారిటీతో గెలిపించండి' అని కోరారు.



నామినేషన్ తర్వాత సతీమణి ప్రతిమతో గురజాల

అక్రమ సంపాదనతోనే విజయానందరెడ్డి ధనవంతుడయ్యాడు

'అక్రమ సంపాదనతోనే చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి ధనవంతుడయ్యారనే విషయం ప్రజలందరికీ తెలుసు. విజయానందరెడ్డి, ఆయన అనుచరులు ఎర్రచందనం, ఇసుక, మట్టి, గ్రానైట్, లాటరీ టికెట్లు, అంతర్రాష్ట్ర మద్యం, గంజాయి వంటి అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నారు. ఇలాంటి వారిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందో ప్రజలు ఆలోచించాలి. వైసీపీ అల్లరి మూకలు ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ కూటమి విజయాన్ని ఎవరూ అపలేరు' అని గురజాల చెప్పారు.

గంగాధరనెల్లూరులో 9 మంది నామినేషన్లు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 24: గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే స్థానానికి బుధవారం తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా థామస్, వడింగాడు నిధి(థామస్ సోదరుడు), పి.రవికుమార్ వేర్వేరు ప్రపోజర్స్ ద్వారా నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థిగా బి.ఎస్ జయప్రకాష్, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా సి.శేఖర్, బీఎస్పీ అభ్యర్థిగా భాస్కర్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఉసురుపాటి పద్మనాభం, పులివేలం మధు, కరుణశ్రీలు నామినేషన్‌లు దాఖలు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

నగరి ఏప్రిల్24: నగరి మండలం దామరపాకంలో వార్డు సభ్యులు పాండ్యన్, ప్రేమల బుధవారం టీడీపీలో చేరారు. నగరి టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్ చేతులమీదుగా టీడీపీ కండువా కప్పుకున్నారు. నగరి పట్టణ పరిధిలో పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుణశేఖర్ మీరా, కృష్ణారెడ్డి, గోపి, మదన్‌కుమార్, బాబురెడ్డి, రాజా, శ్రీధర్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 24: నెల రోజులుగా మెడికల్ లీవ్‌లో ఉన్న చిత్తూరు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి బుధవారం విధుల్లో చేరారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా ఉన్న డీఐవో రవిరాజు బాధ్యతలు నిర్వహించిన విషయం తెలిసిందే.

సరిహద్దు గ్రామాల్లో 'నాటు' ఘాటు

పాలసముద్రం, ఏప్రిల్ 24: రాజకీయపార్టీలు రోజూ ప్రచారాలు నిర్వహిస్తుండడంతో తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. తిరుమలరాజుపురం, నరసింహాపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం పంచాయతీలు తమిళనాడుకు సరిహద్దులో ఉన్నాయి. ఇక్కడ 250 మి.లీ. సారా ప్యాకెట్‌ను రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. అధికారపార్టీ అండదండలతో ఈ సారా వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. మరోవైపు తమిళనాడు నుంచి మద్యం కొనుగోలు చేసి ఇక్కడ బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్నారు. సారా తయారీ, అమ్మకాలపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని అరికట్టాల్సిన అవసరం ఉంది.

టీడీపీ ఇంటింటి ప్రచారం

వడమాలపేట, ఏప్రిల్ 24: వైసీపీ ప్రభుత్వ దురాగాతాలను ప్రజలను వివరిస్తూ వారిలో చైతన్యం తీసుకురావడానికి గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం పత్తిపుత్తూరు, చింతకాల్వ, పచ్చికాపల్లం గ్రామాల్లో ఓటర్లకు టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను తెలియజేసి అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, మునిరత్నం, శేషాద్రి నాయుడు, గోవిందస్వామి, సుబ్రమణ్యం, గజేంద్ర, హేమావతి, లక్ష్మీప్రసన్న, రవినాయుడు, రామూర్తినాయుడు, రమేష్, కుమార్ , నరసింహులు చిన్నబ్బ, మోహన్, జనసేన నాయకులు మునిశేఖర్, బాలాజీ, శివప్రసాద్, సురేష్, చక్రవర్తి, శేషు, ఢిల్లీశ్వర్ దేవరాజులు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రోజాను ఓడించండి

పుత్తూరు టౌన్ : రోజాను ఓడించి ఇండియా కూటమి బలపరచి అభ్యర్థిని గెలిపించాలని సీఐటీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా నాయకుడు గంగరాజు కోరారు. పట్టణంలోని అంబేద్కర్ భవనంలో బుధవారం సీఐటీయూజనరల్ బాడీ సమావేశం భాస్కర్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు సుబ్రమణ్యం పిళ్లై, పురుషోత్తం, భాస్కర్, దళిత నాయకులు నందయ్య, యాసిన్‌బాషా, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బిడ్డను ఆశీర్వదించండి

పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 24: దళిత బిడ్డ అయిన నన్ను ఆశీర్వదించండి. మీలో ఒక్కడిగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీ మోహన్ అన్నారు. పూతలపట్టు పంచాయతీ పరిధి గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బడుగు, బలహీనవర్గాల ప్రజలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రతి దళితబిడ్డ ఆత్మగౌరవంతో బతికేలా కృషి చేస్తానన్నారు. ఇంటింటికీ వెళ్ళి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు యువరాజులు నాయుడు, దొరబాబు చౌదరి, ప్రతాపనేని చంద్రమౌళి, ప్రతాపనేని ఇందిర, దగ్గుమళ్ళ సుధాకర్, మండల జనసేన అధ్యక్షుడు మనోహర్, చిరంజీవి, హిమకర్ నాయుడు, దుర్గ, మురళి, ప్రమోద్, నేతాజి, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మురళీమోహన్

వైసీపీని నమ్మి మోసపోకండి : గాలి భాను



మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

విజయపురం, ఏప్రిల్ 24: వైసీపీని నమ్మి మోసపోకండని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి అధికారంలో వచ్చి కొండల గుట్టలను మాయం చేశారని, రెండవ పర్యాయం అధికారంలో వస్తే ఆస్తులను కూడా ఆక్రమించుకుంటారని ధ్వజమెత్తారు. అనంతరం ఆలపాకం, ముత్తరెడ్డికండ్రిగ, సామిరెడ్డి కండ్రిగ, కళియంబాకం, ఆలపాక కండ్రిగ, బూచివానత్తం గ్రామాలలో పర్యటించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి ధనుంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మెరుపుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు

గొల్లకండ్రిగకు చెందిన విశ్వనాథన్, 20 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆలపాకం నుంచి 12 మంది, మాధవరం నుంచి 10 మంది, సామిరెడ్డి కండ్రిగ నుంచి 5 మంది, గంగమాంబాపురంలో సర్పంచ్ బాబు, బూచివానత్తం, కమ్మ కండ్రిగలో 10 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నగరిలో బేరసారాలు... బుజ్జగింపులు

మంత్రి ఆర్‌కే రోజా బిజీ

నగరి, ఏప్రిల్ 24: అసమ్మతి నాయకులను బేరసారాలు, బుజ్జగింపులతో మంత్రి ఆర్‌కే రోజా బుధవారం బిజీగా గడిపారు. మంత్రి ఆర్‌కే రోజా అసమ్మతివర్గం నాయకులైన రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ కేజే శాంతి, వైసీపీ రాష్ట్రట్రేడ్ యూనియన్ నాయకుడు కేజే కుమార్‌ల ఇంటికి మంత్రి రోజా భర్త సెల్వమణి, ఓ కౌన్సిలర్‌తో కలిసి వెళ్లి బుజ్జగింపులు చేశారు. బుధవారం ఉదయం 10.45 గంటలకు వెళ్లిన వారు సాయంత్రం 3.30 వరకు చర్చలు జరపడం గమనార్హం. ఇటీవలే కేజే కుమార్ అనుచరగణం టీడీపీ కండువా కప్పుకున్నారు. తన అనుచరులతో చర్చించి కలుస్తానని కేజేకుమార్ చెప్పినట్లు సమాచారం. అలాగే ఏకాంబరకుప్పం పరిధిలో పురుషోత్తం ఇటీవల పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుండటంతో ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించారు. అలాగే పట్టణంలో వర్తకులను, దుకాణాదారులను పిలిపించి విడివిడిగా చర్చించారు. ఇటీవల అసమ్మతి వర్గానికి చెందిన అమ్ములు (ఏలుమలైరెడ్డి) చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. బుధవారం తన అనుచరగణాన్ని టీడీపీలో చేర్పించారు.

వైభవంగా సీతారామ కల్యాణం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 24: నగరంలోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామి,అమ్మవార్లకు చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి దంపతుల ఉభయంతో అష్టోత్తర శత కలశ మహాతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ వ్యాపారవేత్త ఎన్‌పీ జయప్రకాష్ దంపతుల ఉభయంతో సీతారామ కల్యాణం, రాత్రి రామభక్తుల ఉభయంతో పుష్పపల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం : కార్వేటినగరం బావుండు వీధిలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి సీతారామ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.



భక్తులకు మాంగళ్యాన్ని ప్రదర్శిస్తున్న పురోహితులు

బలిజకండ్రిగ వద్ద రూ.7.76 లక్షల సీజ్

పాలసముద్రం, ఏప్రిల్ 24: మండలంలోని బలిజకండ్రిగ చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం తమిళనాడులోని షోలింగర్ పట్టణానికి చెందిన రమేష్ బొలేరో వాహనంలో నగదును తరలిస్తుండగా ఎస్‌ఐ భారతి పట్టుకుని రూ.6,45,246 నగదును సీజ్ చేశారు. అలాగే షోలింగర్ నుంచి తిరుపతి వస్తున్న కార్తికేయన వద్ద నుంచి రూ. 54,190, జీడీ నెల్లూరు మండలం వేపంజరికి చెందిన సతీష్‌బాబు వద్ద నుంచి రూ.77490 నగదును సీజ్ చేశారు. సరైన బిల్లులు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుడిపాల : చిత్తూరు-వేలూరు రహదారిలోని గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎటువంటి బిల్లుల్లేక తెస్తున్న రూ.94,500ను సీజ్ చేసినట్లు తనిఖీ అధికారి గణపతి తెలిపారు.

సత్రవాడ చెక్‌పోస్టు తనిఖీ

నగరి, ఏప్రిల్24: నగరి పట్టణం సత్రవాడ వద్ద గల సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ మణికంఠన్ బుధవారం పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతనే వదలాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం నగరి మండలం మాంగాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సెంట్రల్ ఫోర్స్ అకాడమీ కోసం నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు.

ఘనంగా ఆదికేశవులు నాయుడు వర్ధంతి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 24: చిత్తూరు మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయడు 11 వర్ధంతి స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో బుధవారం ఘనంగా జరిగింది. ఆదికేశవులునాయుడు దంపతుల చిత్రపటాలకు ఆయన కుటుంబసభ్యులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం అవధాని మేడసాని మోహన్ తన ఆధ్యాత్మికోపన్యాసంలో బాల్యంతో యవ్వనం, యవ్వనంతో వృద్ధాప్యం, వృద్ధాప్యంతో మరణం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని, వీటన్నీటితో కూడుకున్నాదే జీవితం అని వివరించారు. అనంతరం ప్రముఖ గాయని మణులు ప్రియాసిస్టర్స్ తమ గాత్ర సంగీతంతో సభికులను అలరించారు.ఈ కార్యక్రమంలో డి.కె. బద్రినాథ్, డి.ఎ. శ్రీనివాస్, డి.ఎ తేజస్వీ, డి.ఎ. కల్పజ, సీకె. లావణ్యబాబు, వి.కె. విశ్వనాథ్‌తోపాటు చిత్తూరు బలిజసేవాసంఘం ప్రతినిధులు, సీతమ్స్ కళాశాల విద్యార్థులు, నగరవాసులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికోపన్యాసం చేస్తున్న మేడసాని మోహన్

కాంగ్రెస్‌లో చేరిన ఆకనంబట్టువాసులు

పూతలపట్టు, ఏప్రిల్ 24: పూతలపట్టు మండలం ఆకనంబట్టు దళితవాడకు చెందిన వైసీపీ వీరాభిమానులు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆకనంబట్టు దళితవాడలో వైసీపీకి వీరాభిమానులు ఎక్కువగా ఉన్నారు. వారంతా బుధవారం ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు నివాసానికి వెళ్ళి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ నాయకులు జయరామ్ రెడ్డి, చిట్టిబాబు, రమేష్ బాబు, ఢిల్లీకుమార్, విక్టోరియా, మునికుమార్, భానుచంద్ర, పూర్ణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు

వెదురుకుప్పం, ఏప్రిల్ 24: వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం జరిగింది. అర్జున వేషదారి పాశుపతాస్త్రం కోసం అధిరోహించే తపస్సు కార్యక్రమ ఘట్టాన్ని నిర్వహించారు. అంతకు ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీరాలంటూ కొందరు మహిళలు వరపడ్డారు. అర్జున వేషధారి అధిరోహించాక అక్కడి నుంచి చల్లే విబూది పండ్లు, నిమ్మపండ్లను తీసుకున్నారు. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు బోడిరెడ్డి మోహన్‌రెడ్డి, బోడిరెడ్డి తారక్‌రెడ్డి పర్యవేక్షించారు.



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

విజయపురం, ఏప్రిల్ 24: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొల్లకండ్రిగ, సామిరెడ్డికండ్రిగ, జగన్నాథపురం గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రాజు, నాయకులు చిరంజీవిరెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.